రాజీనామా

కొడవటిగంటి కృష్ణమూర్తిగారు

౧

పట్టాభిరామయ్యా చాలభాగ్యవంతుడు. ఆయనకిద్దరుపిల్లలు: సీత, పూర్ణానందం. పట్టాభిరామయ్యాకు ఉద్యోగంచెయ్యటం నీచమనిపించింది. పొట్టగడవటానికి, డబ్బుసంపాదించటానికి ఉద్యోగంచెయ్యటం ఆయన కిష్టంలేదు. కాని పురుషలక్షణంగా డబ్బురానిఉద్యోగాలుచేస్తుండేవాడు. వరుసను ఆయన నాలుగుసార్లు మునిసిపల్ ఛేర్మనయినాడు.

మొదటినించీ పట్టాభిరామయ్యా గర్వి. ఆత్మగౌరవం నిలుపుకోటానికి ప్రతివాడికీ గర్వముండవలిసిందే. కాని అది ఇతరులను బాధించకూడదు. సీతపెళ్ళిఅయినకొత్తలో ఆయనగర్వం అల్లుడిమీదికే పోయింది. సీత వివాహంఅయిన రెండునెలలకు ఎవరో దూరపుబంధువులువచ్చి మంచి సంబంధము వచ్చిందండీ సీతకు పట్టాభిరామయ్యాగారూ! మంచి అదృష్టంగలపిల్ల" అన్నారు మాటవరుసను.

పట్టాభిరామయ్యాకు ఆసమయంలో అల్లుడంటే కోపంగాఉంది. పెళ్ళిలో పెళ్ళివారికి చాలనీచమైన బట్టలుపెట్టాడు. వియ్యాపురాలు కాస్తనాలుగుమాటలూ అక్కడే అడిగింది. ఆవిడ ఏదన్నా మనస్సులో ఉంటే ఎదటఅడిగేరకం. పెళ్ళంతో సలక్షణంగాజరిగి బట్టల్లోలోపమయింది. అందరూ నొచ్చుకున్నారు. పట్టాభిరామయ్యా గర్వంతో వియ్యాపురాలిని మళ్ళీఅన్నాడు. దాంతో అందరికీ కోపంవచ్చింది. అప్పటినించీ వియ్యాపురాలు—అసలు వియ్యంకుడులేడు—అల్లుడంటే నిరసనతో చూసేవాడు. ఇంట్లో వారివిషయమొస్తే చాలావెత్తిగా ఉండేది. అందుచేత ఆయనకీ ఉత్సాహంచేదయింది.

"ఆ! మంచిసంబంధమే! సీతకింతకన్న మంచిదిరా దగదా? బుద్ధిలేకచేశా నీపెళ్ళి!"అన్నాడు. ఎవరికైనా మాటలమీద కొంతకట్టుబాటు చాలఅవసరం!

సీతకూ తండ్రికున్నగర్వంఉంది. ఆమెకు ఎక్కువమంది 'ప్రాణస్నేహితులు' లేరు—సాధారణంగా ఆడపిల్లలకు అందరూ ప్రాణస్నేహితులే! ఆడపిల్లలు ఒకరితోఒకరు ఎంతెంతరహస్యాలో చెప్పుకుంటారు! ఆమెకు సరస్వతిఒక్కతే మంచిస్నేహితురాలు.

సరస్వతికి చాలచిన్నతనంలోనే వివాహమయింది. ఆమెభర్త చాలదుర్మార్గుడు. సీత సరస్వతితో సంభాషించేటప్పుడు ఆమె భర్తనుగురించి మాట్లాడేదికాదు. సీత కతనివిషయంమాట్లాడటం అసహ్యమొకటీ, రెండోది సరస్వతికి కష్టంగాఉంటుంది.

సీత గదిలో జడవేసుకుంటున్నది. పట్టాభిరామయ్యా పండక్కుఅల్లుణ్ణి తీసుకురావటానికి వెళ్ళాడు. పక్కన హాలులో సందడిఅయింది. పట్టాభిరామయ్యాగొంతు వినిపించింది కోపంతో!

"ఏం? ఎందుచేత రాలేదు?" అన్నది సీతతల్లి.

"ఎందుచేతనా? పొగరెక్కి! ఆశనిపీనుగుపోయి అల్లుడితోనూ, ఆవిడతోనూ నేనన్నమాటలు అన్నాట్ట! నాకేంభయం అంటే?—అవిడ నన్ను పట్టుకుని అడ్డమైన మాటలూఅన్నాది. ఆవిడ అంటుంటే అల్లుడు వింటూ కూర్చున్నాడు!—ఏమిటి నేనన్నమాటల్లో తప్పు? అబద్ధమా? ఇంతకన్న మంచిసంబంధాలు సీతకురాలేదూ? మగపిల్లవాడుకాగానే కళ్ళుకనిపించవు కాబోలు! ఆడపిల్ల కాగానే హీనమేమి? ఎందుకొస్తుందో లోకంలో మగవాళ్ళకీగర్వం! నాకు లోకంతోలెక్కలేదు. అల్లుడుగదా అనిపోయి కాళ్ళుపట్టుకోను. ఆయన రాకపోతే నాకేమీ తక్కువకాలేదు!"అన్నాడు పట్టాభిరామయ్యా. ఇల్లెగిరిపోయింది!

౨

ఆరేళ్లు గడిచినాయి.

వసంతకాలం వచ్చింది. పూర్ణానందం పొద్దున్నే పుస్తకంతీసుకుని తోటకెళ్లాడు. తోటలో సీతారామశాస్త్రి కనిపించాడు. ఇద్దరూఒకచోట కూర్చున్నారు. ఇంతలో ఏమూలనించో ఒకకోయిల "కూ, కూ!"అన్నది. సీతారామశాస్త్రి తీరిగ్గా దగ్గి దానికిజబాబిచ్చేడు. కోయిలకున్నంతగర్వ మింకొకరికిలేదు! దానిగొంతులోనే ఉంది! కోయిలమండిపడి గట్టిగా కోప్పడ్డది శాస్త్రిని"కూ.కూ!"అని. శాస్త్రివదలిపెట్ట లేదు. కోయిల శాస్త్రిని రెండుతిట్టి రెక్కలురుఝాడించి లేచిపోయింది.

"అంతేకావాలి!"అన్నాడు శాస్త్రి తృప్తిగా.

పూర్ణానందం నవ్వాడు.

"సరేకాని ఎమిట్రాసంగతులు? పూర్ణా!"అన్నాడు శాస్త్రి.

"నాకు పిచ్చిఎత్తినట్టుందిరా, శాస్త్రీ!"

"ఎమి?" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంతో మామిడిపిందె కొరకటమాపి.

"ఆవిషయమే!"

"ఏది?"

"మా మామగారివిషయం!"

"నేను చెప్పనా ఒకసలహా?"

"ఊః!"

"తిరిగి పెళ్లి చేసుకో!"

"చస్తే!"

"ఎందువల్ల?"

"నేను భార్యకోసరం తపిస్తున్నాననుకున్నావా?"

"మరేమిటి?"

"పొరబాటు!"

"అయితే చిక్కులేదు!"

"ఎందుకులేదు? మామగారు నాపైన విరోధంగావున్నాడు. నాభయం ఏమిటంటే సీత మధ్య కష్ట పడుతుందేమోనని. చూడు, శాస్త్రీ! మగవాడున్నచోటుండేవాడు. ఆడది ఇంకోచోటికి పోయ్యేది. ఏమంటావ్?"

"నువ్వొక విచిత్రస్వరూపం. అమ్మ ఒకవిచిత్రస్వరూపం. ఒకరికొకరుదొరికారు! అమ్మకాపట్టుదల ఎందుకు? కోతంటతోకల్లే నీకెందుకుపట్టుదల? సీత నెందుకుంచావక్కడ? మీఅమ్మ అక్కడికి నిన్నుపోనియ్యకపోవటమేమిటి? అంతా దుర్మార్గంగా ఉంది!"

"నీకుతెలియదు, శాస్త్రీ! వెధవది—భార్యకోసరం అమ్మకెదురు తిరగమంటావా?"

శాస్త్రి ఒక్కక్షణం కళ్లుమూసుకుని "ఈమాట అన్నందుకెప్పటికైనా పశ్చాత్తాపపడతావురా. పూర్ణా! అంత అభిమానంలేనిభార్య నెందుకు పెళ్లాడావు? నీభార్యతో నీవు కాపురంచెయ్యటం అమ్మకు ఎదురుతిరగట మవుతుందా? ఇంకా అమ్మ నాలుగేళ్ల దాకా ఇలాగేఉంటుందనుకో. అంతవరకూ నీభార్యనీ నిన్ను

స్మరిస్తూ ఉంటుందని నీనమ్మకమా? మనిషిఓర్పుకు అంతుందిసుమా! మరి, అమ్మ తనపట్టుకోసరమే చూస్తున్నదికాని నీసౌఖ్యంవిషయం ఆలోచించిందా? అందుకనే ఫిమినైన్స్‌ఫూల్స్ అన్నారు" అన్నాడు.

"ఆసంగతి మా మామగారికి తెలియనక్కర్లేదూ?."

"నీభార్య నీకెక్కువా, నీమామగారికెక్కువా?"

పూర్ణానందంమాట్లాడలేదు. సీతమీద తనకన్న ఇంకొకరికి ఎక్కువఅభిమానం ఉన్నదని వొప్పుకోవటం అతనికిష్టంలేదు. తనకెక్కువ అభిమానండుందని వొప్పుకుంటే శాస్త్రి గెలిచినట్టే!

"ఇప్పుడు నీభార్యకెన్నేళ్లుంటాయి!"

"పదహారుళ్లు వెళుతాయేమో!"

"అబ్బో!"

* * *

సీతఆరేళ్లలో పూర్తిగా మారిపోయింది.

సాధారణంగా ఆడపిల్లల అభిరుచులు భర్తమీద గౌరవం, అగౌరవం తల్లిదండ్రులు ఇంట్లో ప్రతిరోజూ అనుకునేమాటలమీద ఆధారపడిఉంటయి. మొదట్లో భర్తమీద ఎంతఅభిమానమున్నా వరుసగా సంవత్సరాలపాటు తనభర్తనుగురించి తలితండ్రులు అసహ్యంగామాట్లాడుకుంటూంటే వింటూ ఆడపిల్ల భర్తమీద గౌరవం నిలుపుకోలేదు. అందుకనే ఆడపిల్లలవిషయం తలిదండ్రులు పెళ్లయినతర్వాత బహుజాగ్రత్త తీసుకొనవలెను. ఆడపిల్లలు చెడిపోవటానికికూడా తలిదండ్రులేకారణం. సీతవిషయం అట్లాఅయింది. భర్తచులకనైనాడు.

ఈసమయంలోనే సరస్వతి బాల్యదశలో అత్తవారింటికిపోయింది. అంతవరకు సీత దుఃఖముకాని చీదరగాని ఎరగదు. ఆనాటినించీ ఆమెకు లోకంమీద విరక్తికలిగింది. ఛీ! ఏంలోకం! సరస్వతేమిచేసిందీ కష్టాలుపడటానికి! ఆమెభర్త ఆమెను పశువునుచూచినట్టు చూస్తున్నట్టు ఆమె ప్రతీరోజూ తనతల్లితోచెప్పి దుఃఖిస్తుంది. తనసంగతి ఇట్లాఉన్నది. కేవలం తాను పురుషుడుకావటంవల్ల తనభర్త తనతండ్రిని సాధించకలుగుతున్నాడు. మగవారి కింత నీచపుఆలోచనలుంటాయా? నూటికొకరైనా ఆడవాళ్లను గౌరవంతోచూడరా? బానిసగాఉంటూ స్త్రీ సంసారంలో ఎందుకు సుఖంఅనుభవించాలి?.

ఒకరోజున ఎవోమాసపత్రికచూస్తూ ఎదోకథ చదివిందిసీత. కథరాసినవారి పేరులేదు. కాని కథ అద్భుతంగాఉంది. ఒకస్త్రీ సంసారంలో చిక్కులుపడుతుంది—భర్తపెట్టేబాధలు, అత్తగారు మామగారూ బావగారూ ఆడబిడ్డపెట్టేబాధలు సరిగా లోకంలో జరుగుతున్నట్టేరాశారు. మొదట మొదట భార్య బానిసగాఉండటం మొదలుపెడుతుంది. కాని చివరకు ఆమెకు ఈమాదిరిచర్యవిసుగెత్తి క్రమంగా తానుకూడా వారిమాదిరిగానే చరించటం మొదలుపెడుతుంది. ఇక్కడ కథరాసినతను బాగారాశాడు. పూర్వం భర్త తనమీద ఉపయోగించిన వాక్యాలూ, మాటలూ భార్య భర్తమీద ప్రయోగిస్తుంది. భర్త క్రమ్మంగా మారిపోతాడు. అసలతనిమనస్సు మంచిది. భార్యఅన్నమాటలకు కోపంతెచ్చుకోక "ఆమాట ఆమెఅంట్టే నాకింత కష్టంగా ఉందే నేన్నప్పుడూ ఆమెకింత కష్టంగాఉండి ఉంటుందికద!"అనుకున్నాడు. అదీకాక తనభార్య తనవిషయం ఓర్పుతోకొంతకాలం ఉండటంకూడా గమనిస్తాడు. చివరకు తల్లిదండ్రులకు ఎదురుతిరుగుతాడు. భార్యతో సుఖంగా ఉంటాడు. అదీ కథ. సీత కథరాసినవాణ్ణి చాలమెచ్చుకుంది. "ఈ మాత్రంబుద్ధి అందరికీ లేదేం? అతనిభార్య ఎంతసుఖపడుతుందో?" అనుకున్నది.

సీత చదువులో పడిపోయింది. ఆమెదృష్టి పుస్తకాలమీదికి మారింది. ముఖ్యంగా తండ్రిచేత ఆమాసపత్రిక కొనిపించి చదువుతూండేది. ఆకథరాసిన అతను ప్రతిసారీ కథరాస్తునే ఉన్నాడు. సీతకుమగవాళ్లందరిమీదా కోపంఏర్పడ్డది—తనతండ్రిమీదా, ఆకథలురాసేఅతనిమీదా తప్ప!

3

అతిగర్వికి దూరాలోచనఉండదు——ఉంటే గర్వికాక నేపోను. పట్టాభిరామయ్యకు అంతఅనుభవ ముండీ సీత తనఇంట్లో శాశ్వతంగాఉండదు అన్నస్వల్పవిషయం తెలియకపోయింది! పూర్ క్రీచర్! నిజానికి తప్పుతనదే.

ఒకరోజున ఎవరోబంధువువచ్చి సీతవిషయంఎత్తాడు. పదహారేళ్లా? ఆశ్చర్యపడ్డాడు. ఈపాటికి కాపరానికి వెళ్లవలసిందేనే! పట్టాభిరామయ్యకు అర్థమయింది. ఇంకోరోజున మరొకడొచ్చాడు.. మామూలే! సీత అత్తవారింటనించి ఎప్పుడొచ్చింది?——ఇంకా కాపరానికి పోలేదు? చిత్రం! అయినా ఎక్కువవయస్సు కాదు కాబోలు! ఎంత? అహా! అయినావెళ్లవచ్చును! ఇప్పుడిప్పుడు పదహారేళ్ల దాకా ఉంచుతున్నారు! అయిపోయింది. లోకమంతా తనవిషయం గుసగుసలాడుచున్నారని గ్రహించాడు పట్టాభిరామయ్య.

తనతండ్రి లోకంలో అందరితోటివాడుకాడుఅని సీత ఉద్దేశ్యం. ఆయనకు లోకభీతిలేదనుకున్నది. ఆయన క్రమంగా మెత్తబడటంచూసి సీత భయపడ్డది. తానెంతో నమ్ముకున్నతండ్రి ఇలాఅయిపోతే తనకు నమ్మకం కలవాళ్లెవరు? అహో! ఆకథలురానేఅతనైనా!——అతనుమాత్రం! తనకుఆప్తులులేరు. ఇలాలోకం ఎలాసాగుతుంది చెప్మా! లోకంమంచిదేఅయి నేను చెడ్డదాన్నేమో! నేనొక్కతెనే మంచిదాన్నయి లోకం చెడ్డదవుతుందా? లేక——కాక ఇంకాఎక్కడైనా పొరబాటున్నదా? హాలులో సందడిఅయింది.

"ఏమైంది?"

"ఏమయిందా? మన్నయింది! మాఅల్లుడికెంతపొగరు? నేనుపోయి ఆదొల్పాభిజితల్లికాళ్లు పట్టుకుంటే తాను నాయింటికి వస్తాట్ట! టాంపాయ్! ఏమీ అక్కర్లేదు. లోకంఎట్లాచచ్చిననరే!" పట్టాభిరామయ్య రొప్పటంమొదలు పెట్టాడు. ఆయనవేదనపడుతున్నట్టు సీత గమనించింది: ఆవేదన గర్వంవల్లని ఆమెకు తెలీదు. అతను గర్వంతో పోట్లాడుతుంటే లోకంతోనూ, దుర్మార్గంతోనూ పోట్లాడుతున్నాడనుకున్నది సీత.

పాపం తనతండ్రి తనకొరకు ఎంతశ్రమపడుతున్నాడు!

పట్టాభిరామయ్య గర్వం చచ్చిపోతున్నది. అటువంటి లుచ్ఛాజంతువు ఒక్కసారిచావదు. తనవియ్యపురాలితో మంచిచేసుకోవటం తనకుగౌరవమే! అన్నీఅనుకోటంలో ఉన్నది.

పట్టాభిరామయ్య తిరిగి అల్లుణ్ణిసమీపించాడు. లౌక్యంగామాట్లాడబోయి ఆత్మగౌరవంమాట మరచిపోయినాడు! వియ్యపురాలు వెంటనే సమ్మతించింది.

"ఏమైంది?" అన్నదిభార్య.

"ఆ! ఏమున్నది? నేనెప్పుడువస్తానాఅని కాచుకుకూచున్నారు! నేనువెళ్లి లాంఛనంగా మనలోమనకు ఎందుకు వెధవతగాదాలుఅన్నాను. ఇద్దరూ సమ్మతించారు. సీతను ఎల్లుండి తీసుకెళ్లుతున్నా!"

"పిల్లనుచంపుకుతింటారేమో పంపిన మర్నాటినించీ!" అన్నదిభార్య.

పట్టాభిరామయ్య గదిలోకిపోతూ "గడ్డిపెట్టనూ!" అన్నాడు.

సీతకు అత్తగారిమీద అసహ్యంకలగటానికి తండ్రి కారణమయినప్పటికీ ఆమెకూ ఆయనకూ ఒకభేద మున్నది. పట్టాభిరామయ్యకు గర్వహానిగలిగింది. సీతకు మనస్సేవిరిగిపోయింది. అత్తగారుచిక్కులు పెడతారేమో అన్నఆలోచనవచ్చింది. ప్రాణమన్నావదిలేస్తాను కాని వారికి బానిసగా ఉండను! ఈశరీరం నాది! అభర్తకు ఆహుతిచెయ్యాను. దీనిమీద ఇంకోరి కధికారంలేదు! అనుకున్నదిసీత.

ఆరుసంవత్సరాలు దాటినతర్వాత భార్యాభర్తా ఒకరినొకరు చూసుకున్నారు. పూర్ణానందంకళ్లు చలించినాయి. ఒక్కక్షణం: రెండోక్షణం సీత అతనివంకచూసింది.

రెండుకళ్లల్లో భగవంతుడెంత పెట్టాడు! ఆదృష్టి అతనిమీదపడగానే అతను మారిపోయినాడు.

అతనికళ్లల్లోకాంతి నశించింది.

సీతకు తనమీద ప్రేమలేదు!—అభిమానంలేదు. ఆరెండుకళ్లల్లోనూ పెద్దఅక్షరాలతో ఆసంగతి వ్రాసి ఉంది. ఆమెచెక్కులమీద సిగ్గులేదు. ఆమెకళ్లల్లో కోపంఉన్నా ఎంతోఅందంగా ఉండేది!

రెండుమూడేళ్లనించీ పూర్ణానందం సీతనుగురించి ఆలోచించనిరోజులేదు. కాని ఒక్కసారీ అతనికీఆలోచనతట్టలేదాయెను!—సీతకు తనమీద అసహ్యంఉంటుందని. అయినా తనవల్లతప్పేమిటి? పూర్ణానందానికి శాస్త్రిమాటలు జ్ఞాపకంవచ్చినాయి. తనవల్ల తప్పులేకేమి?

ఆరాత్రి సీత ఒంటరిగా లభించింది. సీత కొంతదూరంలో నిలుచుంది. ఆమెముఖాన అగ్నిహోత్రుడు తాండవమాడుతున్నాడు.

"నామీద నీకభిమానంలేదనుకుంటాను!" అన్నాడు పూర్ణానందం చాలమొరటుగా! ఆమెపేరు అందామనిపించిందికాని నోటివెంటరాలేదు.

"లేదు!" అన్నది సీత గంభీరంగా.

"ఎందువల్ల?"

సీతమాట్లాడలేదు.

"నాతోకాపరంచెయ్యటం ఇష్టంలేదు నీకు?"అన్నాడు మరీపెళుసుగా!

"లేదు!"

"నేనెంత మంచిగాఉన్నా నీతో?"

"నాతోమంచిగా ఉండనక్కర్లేదు!" అన్నదిధైర్యంగా.

"మంచిది!" అన్నాడు పూర్ణానందం లేస్తూ.

ఆమాటసీత ఎందుకనాలి? తనచేతనైనపని చేశాడు.

సీతఉద్దేశ్యంవేరు. ఒకవేళఅతను తనతోమంచిగా ఉండదలచుకుంటే ఇదివరకే తన కోసరం వచ్చేవాడు. ఇప్పుడు మెత్తబడ్డం ప్రేమవల్లకాదు—సుఖంకోసరం. ఆమెఇటువంటి మెత్తదనానికి వశంకాదలుచుకోలేదు. అక్కడికి భార్యాభర్తల సరససల్లాపమంతమయింది.

పూర్ణానందం లేచినచోటే నిలుచున్నాడు ఆలోచిస్తూ. "చూచావా? నీయిష్టంలేకుండా నిన్నుముట్టుకోను—నీకిష్టంఉన్నా ముట్టుకోననుకుంటాను!" అన్నాడునవ్వుతూ.

సీత మండిపడ్డది. అప్పటికైనా అతను తనమీద ప్రేమఉన్నదనిచెబితే సీత నీరైపోయేదే! పూర్ణానందం ఆమెకోపాన్ని లెక్కచెయ్యలేదు. "కాని లోకానికి మనగుట్లు తెలియటం నాకిష్టంలేదు. నీకూఇష్టంలేదనుకుంటాను. అవతల గది ఖాళీగానేఉంది. నువ్వందులో శయనించవచ్చును. తెలిసిందా? తరువాత. ఈ ఇంట్లో నీకుకావలిసినంత స్వేచ్ఛ. నీతినిదాటనంతవరకూ నీకేపని చెయ్యటానికైనా అధికారంఉంది. అర్థమ—"

"నానీతినిగురించి ఇంతవరకు ఎవరూతప్పుపట్టలేదు!" అన్నది సీత గర్వంగా.

సీత తనభర్త తన్ననేకవిధాల హింసిస్తారనుకున్నది. అప్పుడు తనవీరత్వం చూపిద్దామనుకుంది. కాని ఇదేమిటి? తనభర్తకంతశౌర్యం లేదుకాబోలు. దుర్మార్గంఒకతప్పు! అదిచూపలేకపోవటం ఇంకోతప్పు! తనభర్త దుర్మార్గుడుకాదన్నఆలోచన ఆమెకురాలేదు. ఉత్తఅనాధఅన్నఆలోచన వచ్చింది.

సీత అవతల గదిలోకివెళ్లి తలుపుగడియవేసుకున్నది. ఆమెకు చాలసేపటివరకూ నిద్రపట్టలేదు. "ఎక్కడో పొరబాటున్నది! ఎక్కడో!" అన్నఆలోచనే. అకస్మాత్తుగా అవతల గదిలోనించి మాటలు వినిపించినై. పూర్ణానందం ఏమిచేస్తున్నాడో చూస్తే! ఛీ! తనకెందు కతనిజోలి!

సీత తలుపుసందునించిచూచిన బాగుండేది. అతను కుర్చీలోకూర్చొని చేతుల్లో ఒకఫోటోపెట్టుకుని దానివంక ప్రేమతోచూస్తూ "ఏమైంది సీత? ఏమైపోయింది నాసీత!" అనుకుంటున్నాడు. ఆఫోటో సీతపెళ్లి నాటిది.

౪

నెలరోజులు గడిచిపోయినై. సీత అత్తవారింట్లో స్థిరపడిపోయింది. ఆమెఅత్తగారితోగాని భర్తతోగాని స్వయంగా ఎన్నడూసంభాషించలేదు. పూర్ణానందంతల్లికి కోడలిసంగతి కుమారుడిద్వారా తెలిసింది. ఆమె చాలఓర్పుగలమనిషి. సాధ్యమైనంతవరకూ ఆమె సర్దుకుపోతూవచ్చింది. అందరితోనూ కోడలిని గురించి మంచిగానే చెప్పేది.

ఏమైనాకావలిస్తే తన్నడగమనిచెప్పాడు పూర్ణానందం సీతతో రెండోసారి మాట్లాడినప్పుడు. కాని సీతకు అడగటం ఇష్టంలేకపోయింది. తనకుకావలిసిన మాసపత్రికలకోసం ఇంకాఏదో చిల్లరవస్తువులకోసం ఉత్తరాలురాసి ఇంటినౌకరుచేత పోస్టులో వేయించేది. వచ్చినవస్తువులు తానేస్వయంగా తీసుకునేది. పూర్ణానందం గ్రహించాడీవ్యవహారమంతా.

"పోనీ దానికిక్కడ కష్టంగాఉండేమో పుట్టింటికైనా తీసుకుపోరా!" అన్నదితల్లి.

పూర్ణానందం నవ్వాడు.

"ఎందుకే? అంతపోవాలని ఉంటే తండ్రికి ఉత్తరంరాయగలదు!" అన్నాడు సీత వినేటట్టుగానే. సీతకు చెప్పరానిమంటవచ్చింది.

"ఎలాఉంటయిరా స్థితిగతులు, పూర్ణా!"అన్నాడు శాస్త్రి ఒకరోజున.

"ఏంచెప్పను? ఇంతవరకు మాఆవిడకు నాతోగాని అమ్మతోగాని పరిచయంకలగలేదు!"

"అంటే?"

పూర్ణానందం విప్పిచెప్పాడు.

"చిత్రం! నెలరోజులనించీ అలాఉందా? నువ్వేమైనా తిప్పాలని ప్రయత్నంచేస్తున్నావా?"

"ఏమిటిప్రయత్నం? బలవంతాన మనస్సువిప్పితే అది శాశ్వతంగా ఉంటుందా?"

"ఇంతప్రయత్నం వ్యర్థం!"

"ఎంతప్రయత్నం?"

"నేనే మీ మామగారికి చీవాట్లుపెడుతూ ఉత్తరంరాశాను. అమ్మను శాంతపరిచాను. నన్నుక్షమించు, పూర్ణా! నిజంగా నీకు సుఖంకలుగుతుందనుకున్నాను. నీఅవస్థచూసి జాలిపడ్డాను. ఇప్పుడు నీ అవస్థచూడలేకుండాఉన్నాను. నీకెంతఓర్పురా!"

అతనికెంతఓర్పో అతనికేతెలుసును!

శాస్త్రి వెళ్లిపోయినాడు. నౌకరు ఉత్తరంఒకటి తెచ్చిచ్చాడు—తనమామగారిదగ్గిర్నించి. శ్రావణ మాసం నోములకు కుమార్తెను తీసుకెళ్లుతానని రాశాడుమామగారు. ఈవృత్తాంతం తల్లికి సీత వినేటట్టు చెప్పాడు. మర్నాడుదయం పట్టాభిరామయ్యగారు గొడుగుతో దిగాడు.

పూర్ణానందం మామగారితో చాలామర్యాదగా సంభాషించాడు. పూర్ణానందం విషయం కనుక్కోటం మర్చిపోలేదు.

పట్టాభిరామయ్యగారు సాయంత్రం కుమార్తెతో బయలుదేరాడు. ఎప్పుడైనావచ్చిపొమ్మని పూర్ణానందాన్ని పట్టాభిరామయ్య ఆహ్వానంచేశాడు. పూర్ణానందం అట్లాగేనని ధైర్యంచెప్పాడు.

సీతకు పుట్టింటికిరావటం కులాసాగానేఉన్నది. ఆమెవచ్చిందని తెలియగానే చుట్టుప్రక్కలమ్మలంతావచ్చి చుట్టుముట్టారు. "పాపం, సీతనుబాగాచూస్తారా అత్తవారు?" అని ప్రశ్నించిందోనీతిగల అత్తగారు కోడల్ని. అందరూ ఈప్రశ్న అందుకున్నారు. సీతను సమాధానంచెప్పనీకుండా ఆమెతల్లి "అయ్యో, తల్లీ! వెళ్లి నెలరోజులుకాలేదు. లక్కపిడతల దగ్గర్నించీ పంపించమని నాకు ఉత్తరాలురాశిందమ్మా!" అన్నది. అక్కడినించీ నలుగురూ సీతనుఅత్తవారుపెట్టేబాధలు ఊహించటం మొదలుపెట్టారు. అప్పుడు సీతకు చాల సిగ్గు కలిగింది. నిజంగా వారుతన్ను కష్టపెడితే ఎంతబాగుండేది?

"సరస్వతిక్కడే ఉన్నదే సీతా!" అన్నారెవరో.

"ఆపిల్లదానికష్టాలేం చెప్పేదిలేవమ్మా! దానిమొగుడుపాపం పెట్టవలిసినబాధలన్నీ పెట్టి లేచిపోయినాడు. చండాలుడు. ఇప్పుడుదాన్ని గుర్తుకూడా పట్టలేం!"

సీతకు మనస్సుకాలిపోయింది. అట్లాఅవస్థపడుచున్న సరస్వతి పక్కనఉంటుంటే తన్నుచూసిజాలిపడతారేం? ఆరాత్రికి సరస్వతి, సీతా కలుసుకునే అవకాశంలేకపోయింది ఇద్దరిళ్లూదగ్గిరేఉన్నా.

మర్నాడు సరస్వతినిచూచి సీత దుఃఖము ఆపుకోలేక పోయింది.

సరస్వతి దీనంగా "పాపం! నీస్థితికూడా నామాదిరిగానేఉన్నదని విన్నానే, సీతా! నేనంటేఎందుకూ పనికిరానిదాన్ని! నీకేమే?"

సీత కొంచెము ఆలోచిస్తూ "నేను నీ స్థితిలోఉన్నాననుకుంటావా?" అన్నది.

"ఏమి? నీఅత్తగారు, భర్తా నిన్ను సరిగాచూడరట. నీకేదికావలిసినా ఇవ్వరట!"

"నేనుఅడగను. నేనడిగితే ఇస్తారు!"

"ఏమిటే?"

"అంతావిని ఆశ్చర్యపడు, సరస్వతీ!"

"చెప్పు, వింటాను!"

సీతకు తనవల్లతప్పులేదని ధైర్యంఉంది. సీత సరస్వతికి మొదటినించీజరిగినసంగతి పూసగుచ్చినట్టు చెప్పింది. సరస్వతి నేలవంకచూస్తూఅంతావిన్నది.

"ఏమంటావు సరస్వతీ?" అన్నదిసీత అనుమానిస్తూ.

సరస్వతి మాట్లాడలేదు.

సీత నిర్ఘాంతపోయింది.

"నువ్వు చెప్పిందంతా నిజమేనా?"

"ఆ!"

"నేనేంచెప్పను? నాకెక్కువ తెలీదు మనుష్యులసంగతి! నేననుకునేది తప్పుకావచ్చును!"

"నువ్వేమనుకుంటున్నావు?"

"నన్నిప్పుడు వెళ్లనీ, సీతా! తరువాత మాట్లాడుదాం—ఇంకోసంగతి!" అంటూ సరస్వతిలేచింది

"నన్నిప్పుడు వదలిపెట్టిపోతావూ!" అన్నది సీత నోటమాటరాకుండా.

"వేరేఏమనుకోకు. నామనస్సు సరిగాలేదు!"

సరస్వతి నాలుగడుగులువేసి గడియమీదచెయ్యివేసి వెనక్కుతిరిగిచూచింది. సీత మంచంమీద బోర్లపడి ఏడుస్తున్నది. సరస్వతి తిరిగివచ్చి సీతను కౌగలించుకొన్నది.

సీత బలవంతంగా దుఃఖము ఆపుకుంటూ "నేను మొదటినించి ఏదోపొరబాటుఉన్నదని అనుకుంటూనే ఉన్నాను. ఏదో నామట్టిమెదడుకు తట్టలేదు! ఎందుకు నీకంతకోపం నామీద?" అన్నది.

"అయితే నీభర్త చేసినతప్పేమిటి? నీకెందు కతనిమీద అసహ్యంకలిగింది?"

సీత మాట్లాడలేదు.

"మీతండ్రికి, మీఅత్తగారికి విరోధంవచ్చినప్పుడే నేను విషయంఎరుగుదును. పైగా నీతండ్రివిషయం నాకుతెలుసును. అప్పుడైనా నీకు నీభర్తమీద అనుమానమున్నదని తెలిస్తే నేచెప్పేదాన్నే. నీతలిదండ్రులు నీభర్తను దూషించారు. కాబట్టి నీభర్త చెడ్డవాడయినాడా? పోనీ నువ్వక్కడికివెళ్లినతరువాత నీఉద్దేశంసరిగా ఉన్నదోలేదో చూసుకున్నావా? నిన్ను మొదటిరోజున అడిగినప్పుడు నీకు తనమీదఅభిమానం ఉన్నసంగతి అడిగాడుకాని తనకు నీమీదఅభిమానం లేనట్టుచెప్పాడా? ఇటువంటివిషయాలు నీవంటిదాని కింకోరు చెప్పాలా? నీభర్తమనస్సు ఎంతవిరిచావో ఊహించుకోగలవా? ఇప్పటికే అంతామించిపోయిందేమో! ఎంతతెలివితక్కువదానివి సీతా! భార్యతెలివిగలదైతే భర్తఎందుకు విముఖంగాఉండాలి. భర్తనుసంతోష పెట్టేది ఒక్కచక్కదనమేనా? అంతకన్న ఆకర్షించేమార్గాలులేవా? నేను నాభర్తను ఏవిధంగానైనా ఆకర్షించగలిగితే ఇప్పుడీస్థితిలో ఉంటానా? ఇప్పటికైనా బహుశమించిపోదు. భార్యకు భర్తదగ్గిర అభిమానంఉంటుందా? గర్వంఉంటుందా? నీతండ్రి వాళ్లనెందుకట్లా అనాలి? నీదే తప్పని నీభర్తదగ్గిర చెప్పుకోటం నీకభిమానమా?"

సీతకుతనతప్పు సరస్వతి రెండువాక్యాలతోనే తెలిసిపోయింది. సరస్వతికొంచెముసేపుండి నిట్టూర్పు విడిచి నవ్వింది.

"కాలమహిమ! నీకు నేను చెప్పవలసివచ్చింది!"

"అలాఅనకు! నీకు, నాకూ ఎంతభేదంఉంది!"

"బోలెడు!"

"నీకు నాభర్తలాంటివాడెందుకుదొరకలేదు? సరస్వతీ!"

"ఎవరుచెబుతారు? కానిఒకటినిజం. నీభర్తలాంటివాళ్లు అరుదు!"

"ఛీ! ఛీ! ఛీ! మాఅత్తగారిముందరా, ఆయనముందరా ఎంతకోతిగాప్రవర్తించాను!"

"తిరిగి వారినిచూడటానికి సిగ్గుగాఉండదూ? సీతా!"

"రోగమా? చేసినపనికి!"

సరస్వతి నిట్టూర్పువిడిచింది. "ఇక చిక్కులేదు!"

రోజులుగడిచిపోతున్నై. శ్రావణమాసం అయిపోయినా పూర్ణానందంరాలేదు—ఎందుకువస్తాడు? సీత కనుమానంజాస్తయింది. పూర్ణానందం శనివదలిందని ఊరుకున్నాడేమో!

భాద్రపదం గడుస్తున్నది! సీతకు భయంఎక్కువయింది. పట్టాభిరామయ్యకే అనుమానంకలిగింది. "అమ్మాయిని ఇంకాకొద్దిరోజులుంచుకోటానికి అభ్యంతరంలేదనుకుంటాను" అనిఉత్తరంరాశాడు. "ఎంత మాత్రంలేదు" అనిజబాబువచ్చింది.

ఉత్తరంవచ్చినరోజున సీత రహస్యంగా ఏడిచింది. అతనికి తనవిషయం ఎట్లా తెలుస్తుంది? తనను అత్త వారింటదింపమనటాని కామెకుసిగ్గుగాఉంది.

చివరకు సీత కొకఉపాయంతట్టింది. ఒకసాయంత్రం తమ్ముణ్ణిపిలిచి కవరువకటితెప్పించింది. తమ్ముడి పేరు భర్తపేరుఒకటేకావటంచేత పేరుపెట్టిపిలవటం అలవాటుకాదు.

"ఒకరహస్యంచెబుతా రారా అబ్బాయి!" అని వాణ్ణి రహస్యంగాతీసుకుపోయి ఒకకలంకాగితంతెచ్చి "నేనుచెప్పేదిరాయి!" అన్నది.

పూర్ణంఅప్పుడే ఎ బి సి డీలునేర్చుకుంటున్నాడు. కాని అతనికింకా కలంతో రాయటంచేతకాదు.

"నాకుచేతకాదు!" అన్నాడు.

"చేతయినట్టు రాయి!"

"చెప్పు!"

మ-రా-రా-శ్రీ—

"నువ్వురాసి చూపించు—"

లాభంలేదు. తానొకకాగితంతీసుకుని వాడురాయలేనిమాటలు తానురాస్తూ ఉత్తరంపూర్తిచేసింది.

"బావగార్కి నమస్కారములు:—మీరువెంటనేవచ్చి అక్కయ్యనుతీసుకుపోవలెను. పూర్ణం."

ఈవిధముగానే ఎడ్రసురాయించి పోస్టాఫీసులోవేయించింది.

"చూడు, ఇదంతా ఎవ్వరితోనూ, చెప్పకు!" అన్నది తమ్ముణ్ణిబుజగిస్తూ.

"నాకెందుకేం?" అన్నాడు పూర్ణం గంభీరంగా!

అంతటితో సీతమనస్సు కొంతతేలికయింది. ఆరాత్రి ఎట్లాగోగడిపింది. మర్నాడు ప్రారంభమయింది. ఉత్తరం పదిగంటలకందుతుంది. సాయంత్రం ఆరింటికిరావచ్చును. సీత తనముందుగతి ఆలోచించటం మొదలు పెట్టింది. ఎట్లా తెలియజేస్తుంది తనపొరబాటు భర్తకు? ఇంతలోగడియారం పదకొండుకొట్టింది. ఇంకా ఏడు గంటలకు తనభర్త—వస్తాడా?

"పూర్ణం!" అన్నది బైటచప్పుడువిని. జవాబులేదు. సీత బద్ధకంగా కూర్చున్నచోటినించీలేచి తలుపు తెరచింది. పూర్ణానందం సూటుకేసుతో సహా లోపల అడుగుపెట్టాడు.

అతనికి ఉత్తరం అందలేదన్నమాట. అందితే అప్పుడే వచ్చిఉండడు. ఎంతదురదృష్టం! ఆఉత్తరం చాలసహాయం చేసేదిసీతకు. రాకరాక అతను రెండుమూడుగంటలు ముందుగా బయలుదేరాడు!

పూర్ణానందం సీతను పలకరించలేదు. ఆమె అతనిముఖంవంక చూడలేకపోయింది—తనజన్మకు మొదటిసారి.

సీత మెల్లిగా గదిబయటికిపోయి వంటఇంట్లోకిపరుగెత్తింది గుండెలు గబగబాకొట్టుకుంటూ.

"ఏమిటేఅమ్మా!" అన్నది తల్లి పొయిదగ్గర కళ్ళుచికిలిస్తూ.

"మీఅల్లుడొచ్చారు!" అన్నది సీత కళ్ళుపెద్దవిచేసి.

"ఏమిటే? అంత గొణుక్కుంటూ మాట్లాడతావేమే?"

సీతదగ్గిరికెళ్ళి తిరిగిచెప్పింది.

తనకుమాత్రెకు భర్తనుచూస్తే ఎంతభయం!

"ఎప్పుడురావటం?"

"ఇప్పుడే!"

"మీఅమ్మగారు కులాసా?"

"ఆ! మళ్ళీ ఒంటిగంటబండి కెళ్ళాలి. త్వరగా వంటకానియ్యండి. నాకొక్క క్షణంతీరదు. మళ్ళీ సాయంత్రానికి కక్కడుండాలి!"

"అయ్యో! వారూళ్లోలేరు!"

"ఫర్వాలేదు"

"వంటకావస్తున్నది" అంటూ అత్తగారు లోపలికిపోయింది. అలా గువ్వలాగూర్చుంటావేమే? అమ్మాయి! వెళ్ళి స్నానంచెయ్యటానికి నీళ్ళుఇయ్యరాదూ?"

సీత మెల్లిగాలేచి గదిదగ్గిరికివెళ్ళి అనుమానిస్తూ నిలుచుంది. పూర్ణానందం పెట్టెసర్దుతూ తలఎత్తిచూచి "ఏమిటి?" అన్నాడు.

"స్నానంచేస్తారా?" అన్నది సీత హీనమైనగొంతుతో. పూర్ణానందం "ఏమిటీ?" అంటూ దగ్గిరకొచ్చాడు.

"స్నానంచేస్తారా?" అన్నది సీత వణుకుతూ.

పూర్ణానందం ఆకస్మాత్తుగా సీతచెయ్యిపట్టుకున్నాడు. సీత శరీరంజలదరించింది. ఆమె చెక్కిళ్ళు కొద్దిగా ఎర్రబారినాయి. సీత చెయ్యినిమురుతూ, "ఆడవాళ్ళు సిగ్గుపడడంలో అందంలేదని ఒకడంటాడు, సీతా!" అన్నాడు మెల్లిగా పూర్ణానందం.

సీతకేమీతోచలేదు. ఒక్కక్షణంలో మూర్ఛమట్టుకువచ్చేటట్టుంది.

"నామీద నిజంగా నీకు అభిమానంఉందికాదూ? సీతా!"

సీతకేమిచెప్పాలో తెలియలేదు.

"నీకు నామీద అభిమానం ఉందని తెలిస్తే నాకెంత సంతోషంగాఉంటుందో తెలుసునా? అందుకోసరం నేనారేళ్ళు కనిపెట్టుకున్నాను సుమా!"

సీతకు మనస్సు కరిగిపోయింది. "పాపం!" అన్నది సీత మొదటిసారి తలఎత్తి.

"నన్నికవదలిపెట్టవుకదూ?—నేనెంత దుర్మార్గంగాఉన్నానీతో—"

"నన్నుక్షమించరూ?" అన్నది సీత.

పూర్ణానందం ముగ్ధుడైపోయినాడు. అతని నోటివెంట మాటరాలేదు. సీతను గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

భగవల్లీల

శ్రీమతి పాకనాటి శ్రీలక్ష్మీకామేశ్వరిగారు

తరమెవర్ణింపఁగా పరాత్పరునిమాయ
మహిమలెన్నంగవశమానె మనకునెల్ల
అఖిలమును భగవల్లీలయగునెగాదె
జగము నాటకశాలగ దగనొనర్చి
నటకులనుగాఁగ జీవులనాడఁజేసి
శాశ్వతము లనిపించు సంసారమెల్ల
అంత నాదనిపించు దురాశమించ
దీనిమూలంబు రవ్వంత తెలియలేక
గాలమున జేప జిక్కినకరణి నహహా
గాఢతిమిరంబునంబడి కాలమెల్ల
గడపనెంచదవేల చీకాకులేక
జన్మసార్థకమాచర్య జగతిలేదె
"మంచినెంచుచు మంచినేయెంచిచేయ
సార్థకంబగుగాదె ఈజన్మ" మంచు
బుధులుచెప్పెడినట్టి ఈబుద్ధివినుము
పాపకూపానబడకు మోసాడుమనస!